క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీ

వేల్పూర్: మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై మంగళవారం ఎస్సై వినయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, హెల్మెట్ ధరిస్తున్నది లేనిది తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు.

తైబజార్ వేలం పాట రద్దు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి జీపీలో ఈనెల 21న నిర్వహించే తైబజార్ వేలం పాట రద్దు చేసినట్లు కార్యదర్శి శాంతి కుమార్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున తైబజార్ వేలం పాట రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మళ్లీ వాయిదా పడిన వేలం



నవీపేట: మండల కేంద్రంలో జరిగే మేకలు, కూరగాయల సంతతో పాటు సులభ్ కాంప్లెక్స్‌లకు మంగళవారం నిర్వహించిన వేలం మళ్లీ వాయిదా పడింది. గత రెండు పర్యాయాలు ఆశించిన ధర వేలంలో రాలేదని వాయిదా వేసి మూడోసారి నిర్వహించగా మళ్లీ వాయిదా పడింది. మేకల సంతకు రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించిన 123 మంది వేలంలో పాల్గొని రూ.40,51,000ల వద్ద వేలం పాడి ముందుకు వెళ్లలేకపోయారు. గతేడాది ఈ సంతకు రూ.55 లక్షల ఆదాయం వచ్చింది. అలాగే వారాంతపు కూరగాయల సంతకు 57 మంది రూ.లక్ష చొప్పు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. రూ.5,19,000 దగ్గర వేలం పాడి ఆగిపోయారు. ఈ సంతకు గతేడాది రూ.15 లక్షల ఆదాయం వచ్చింది. అలాగే సులభ్ కాంప్లెక్స్ నిర్వహణకు రూ.1,45,000 వేలం పలికి ముందుకెళ్లలేదు. ఈ మూడింటికి ప్రభుత్వ ధర రాలేదని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, కార్యదర్శి రవీందర్ నాయక్‌లు విలేకరులకు తెలిపారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

రెంజల్(బోధన్): ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సమస్యలను పరిష్కరించాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వంద శాతం పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ ద్వారా రాబట్టాలని పేర్కొన్నారు. అంతకు ముందు నీలా గ్రామాన్ని సందర్శించి పంచాయతీరాజ్ యాప్ పనితీరును పరిశీలించారు. సమావేశంలో ఎంపీవో గౌస్, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండో రోజు నామినేషన్ల స్వీకరణ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల ఎన్నికల్లో భాగంగా మంగళవారం రెండో రోజు నామినేషన్లను ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్‌లు స్వీకరించారు. ఈ ప్రక్రియలో భాగంగా అధ్యక్ష పదవికి చిలుక సుభాష్, సంయుక్త కార్యదర్శిగా మద్దుల గంగారాం నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. కృష్ణ పండిత్, ఎంకే నరేందర్, చిన్నారెడ్డి, కృష్ణంరాజు, జక్కుల శ్రీధర్, వెంకటేశ్వర్, జగన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అనికేశ్, రమేశ్ ఇటీవల చేపల వేటకు వెళ్లి మృతి చెందగా.. గద్దల సంతోష్ అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గృహ జ్యోతి అందేదెలా?

- ఎస్సారెస్పీ ప్రభుత్వ క్వార్టర్ల కాలనీవాసుల ఆవేదన
- మీటర్లన్నీ ఈఈ పేరుతో నమోదు
- జీరో బిల్లు రాకపోవడంతో లబోదిబోమంటున్న కాలనీవాసులు



ఎస్సారెస్పీలో ప్రభుత్వ క్వార్టర్ వద్ద అమర్చిన విద్యుత్ మీటర్



ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరుతో వస్తున్న బిల్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీలోని ప్రభుత్వ క్వార్టర్లలో నివాసం ఉంటున్న పేదలకు గృహ జ్యోతి పథకం అందని ద్రాక్షలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకంలో భాగంగా పేదలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తోంది. కాని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీలో ప్రభుత్వ క్వార్టర్లకు అమర్చిన విద్యుత్తు మీటర్ కనెక్షన్లు అన్నీ ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరున ఉన్నాయి. కాని రేషన్ కార్డులో విద్యుత్ కనెక్షన్‌దారుని పేరు ఉంటేనే గృహ జ్యోతి పథకం వర్తిస్తుంది. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరున ఉండటం వల్ల కంప్యూటర్‌లో సాఫ్ట్‌వేర్ తీసుకోవడం లేదని అధికారులు అంటున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలోనే ప్రాజెక్ట్ రక్షణ కోసం అధికారులు, సిబ్బంది స్థానికంగా ఉండటం కోసం ప్రభుత్వం 830 క్వార్టర్లను నిర్మించింది. క్వార్టర్లు కాలం చెల్లినవి కావడంతో ఆ క్వార్టర్లలో అధికారులు ఉండటం లేదు. దీంతో అందులో ప్రాజెక్ట్ కార్యాలయానికి ప్రతి నెలా అద్దె చెల్లిస్తూ అనేక మంది పేదవారు నివాసం ఉంటున్నారు. గతంలో ప్రాజెక్ట్ కార్యాలయ విద్యుత్తు మీటర్ నుంచే కాలనీ మొత్తం విద్యుత్ సరఫరా జరుగుతుండేది. దీంతో విద్యుత్ బిల్లు భారం కార్యాలయం మీద పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరున విద్యుత్తు కనెక్షన్‌లు తీసుకుని మీటర్లను అమర్చారు. ప్రస్తుతం అలానే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరున ఉండటంతో లబ్ధిదారులకు గృహ జ్యోతి పథకం అందడం లేదు. అసలైన లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్ తమ పేరున లేకపోవడంతో గృహ జ్యోతిని కోల్పోతున్నారు. పాలకులకు తమ ఓట్లు తప్ప తమ కష్టాలు పట్టవని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు, పాలకులు స్పందించి గృహ జ్యోతి అందేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**
>
> శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీలోని ప్రభుత్వ క్వార్టర్లలో నివాసం ఉంటున్న పేదలకు గృహ జ్యోతి పథకం వర్తించడం లేదని మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కాలనీవాసులు తమ సమస్యను రాత పూర్వకంగా అందిస్తే కలెక్టర్‌కు విన్నవిస్తాం.
>
> – వనజ, ఎంపీడీవో, మెండోరా

జైతాపూర్‌లో ట్రైనీ ఐఏఎస్ ఆకస్మిక పర్యటన



మహిళా సంఘం సభ్యులతో మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి

ఎడపల్లి(బోధన్): జైతాపూర్‌లో మంగళవారం ట్రైనీ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ కిరణ్మయి ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలించి బోధన అంశాల గురించి వివరంగా తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలోని మహిళా సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలు, వాటిని సద్వినియోగం చేసుకుంటున్న తీరుపై వివరాలు సేకరించారు. మహిళా సంఘాలు జ్యూట్ బ్యాగుల తయారు చేయడం పట్ల అభినందించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, పిల్లలు, బాలింతలకు అందజేస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంపీడీవో గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నగేష్, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ చౌదరి, మాజీ సర్పంచ్ సూరిబాబు ఉన్నారు.

సొసైటీలను సద్వినియోగం చేసుకోవాలి



సొసైటీ చైర్మన్ రాజారెడ్డిని సన్మానిస్తున్న రైతులు

బోధన్‌రూరల్(బోధన్): రైతులు సొసైటీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పెంటాకలాన్ సొసైటీ చైర్మన్ దొనకంటి రాజారెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో సొసైటీ చైర్మన్ దొనకంటి రాజారెడ్డి ఆధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో షేక్ బాబా సొసైటీ లావాదేవీలు, అభివృద్ధి పనుల గురించి చదివి వినిపించారు. పాలకవర్గం సభ్యులు, రైతులు చర్చించి సొసైటీ ఆధ్వర్యంలో నూతన పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని, రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ అందించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేశారు. అనంతరం సొసైటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ చైర్మన్ రాజారెడ్డిని సన్మానించారు.

పౌష్టికాహారం కచ్చితంగా తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారిణులు

పెర్కిట్(ఆర్మూర్): గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా కచ్చితంగా పౌష్టికాహారం తీసుకోవాలని ఏసీడీపీవో జ్యోతి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో జ్యోతి మాట్లాడుతూ.. చిరు ధాన్యాలు నిత్య జీవితంలో ఒక భాగం కావాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్న ప్రాశన, అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు తార, టీచర్లు ప్రవంతి, స్వర్ణలత, సరిత, సునంద, వహీదా బేగం, సీహెచ్ లింగమణి తదితరులు పాల్గొన్నారు.

జీజీ నడ్కుడలో లెప్రసి సర్వే



డొంకేశ్వర్(ఆర్మూర్): జీజీ నడ్కుడలో మంగళవారం వైద్యారోగ్య శాఖాధికారులు లెప్రసి(కుష్టు వ్యాధి)సర్వే చేశారు. ఈ నెల 11 నుంచి 24 వరకు గ్రామాల్లో ఈ సర్వేను నిర్వహించి వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి ప్రభుత్వం నుంచి చికిత్స అందిస్తామని హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్ తెలిపారు. మండలంలో ఈ సర్వే పూర్తి కావొచ్చిందన్నారు. ఇందులో ఎంఎల్‌హెచ్‌పీ అమూల్య, ఏఎన్ఎం రజని, ఆశావర్కర్లు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా మహాదేవస్వామి కల్యాణోత్సవం



కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లోని మహాదేవస్వామి ఆలయంలో మంగళవారం అన్నపూర్ణ సమేత మహాదేవస్వామి కళ్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రజనీకాంత్, కార్యదర్శి కుందారం శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

బాల్కొండ: వన్నెల్(బి) గ్రామంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వరుని కల్యాణ వేడుకలను మంగళవారం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. రాత్రికి గ్రామంలో రథోత్సవం చేపట్టారు. ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవం

రుద్రూర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం టీడీటీ దేవస్థానం బృందం ఆధ్వర్యంలో శ్రీమద్ భగవద్గీత, శ్రీరామాయణ సుందరకాండ పారాయణం చేశారు. మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిదుర పుష్పలత వీరేశం, కార్యదర్శి గెంటెల సాయిలు, ఉపాధ్యక్షుడు కర్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

- ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి



సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, ఏసీపీ

పెర్కిట్(ఆర్మూర్): రోటరీ క్లబ్(ఆర్మూర్) సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఆర్మూర్ ఏసీపీ బస్వా రెడ్డి అన్నారు. పెర్కిట్‌లో సోమవారం రాత్రి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవలు పొందిన వారు సేవలందించిన వారిని మరిచి పోవద్దన్నారు. అనంతరం గోస్కొండ అశోక్(స్వచ్ఛ భారత్– స్వచ్ఛ కాలనీ నిర్వహణ), మాదరి స్వామి(బ్లడ్ బ్యాంకు నిర్వహణ), గణేష్(108 అంబులెన్సు నిర్వహణ), లక్ష్మీ దుర్గ(న్యూస్ రీడర్), సుమన్(ఆధ్యాత్మిక రంగం), బోండ్ల ఆనంద్(మిమిక్రీ రంగం), రవీందర్(ఇరిగేషన్, సేవా దృక్పథం), మోహన్(ఉచిత కుట్టు మిషన్, మగ్గం శిక్షణ), చౌకే లింగం(జానపద కళలు), జిందం నరహరి(కవితా మాల, గాయకుడు)లను ఏసీపీ సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో రవి కుమార్, ఎంఈవో రాజ గంగారాం, రోటరీ క్లబ్ ఆర్మూర్ అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ, పటా్వరి తులసి కుమార్, పీడీజీ హనుమంత్ రెడ్డి, పీఏజీ విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటలపై అవగాహన

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్, కూరగాయల సాగులో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవోలు మహేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో మంగళవారం సీఎం చిత్రపటానికి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థికంగా వెనకబడిన రెడ్లకు ఆర్థిక పరిపుష్టి కల్పించడానికి రెడ్డి కార్పొరేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు తిరుమల రెడ్డి, గోపాల్ రెడ్డి, శరత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వీరా రెడ్డి, రమేష్ రెడ్డి, దొడ్ల రవీందర్ రెడ్డి, వసంత్ రెడ్డి, తదితరులున్నారు.

బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించిన ట్రైయినీ అధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): హైదరాబాద్ దూలపల్లి ఫారెస్టు అకాడమీకి చెందిన ట్రెయినీ ఫారెస్టు బీట్ ఆఫీసర్లు మంగళవారం డొంకేశ్వర్ మండలం ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించారు. చిన్నయానం, జీజీ నడ్కుడ శివారులో వన్య ప్రాణులను తిలకించారు. ఈ సందర్భంగా ఫ్లెమింగో పక్షులు, జింకల సంచారంపై వారికి అవగాహన కల్పించారు. అలాగే అటవీ చట్టం అంశాలను వివరించారు. అకాడమీ డైరెక్టర్ రామకృష్ణ, ఆర్మూర్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు



వేల్పూర్: వెంకటాపూర్‌లో మంగళవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్రాద్‌లో..

మాక్లూర్: అమ్రాద్‌లో మంగళవారం మండల పశువైద్యాధికారులు ఉమా సహేర్, కిరణ్‌దేశ్‌పాండే ఆ ధ్వర్యంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. పశువైద్య సిబ్బంది వినీత, గంగాజమున, అహ్మద్‌పాషా, సుధీర్, జైల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

22న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



ఆర్మూర్: మచ్చర్లలో గ్రేస్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు తెలిపారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులు నిర్ధారణ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాన్ని పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాపంథా సబ్ డివిజన్ కార్యదర్శి బట్టు కిషన్, నాయకులు మాచర్ల రాజన్న, జక్కం శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

21న 1104 యూనియన్ సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో ఈనెల 21న ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నరేందర్ నాయక్ తెలిపారు. సమావేశానికి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, ఆర్టిజన్లు, స్పాట్ బిల్లింగ్ కార్మికులు హాజరుకావాలని కోరారు.

ఆశతో వచ్చి నిరాశతో ఇంటికి..



ప్రజాపాలన అర్జీలను సరి చేయించుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు

రెంజల్(బోధన్): ప్రజాపాలన దరఖాస్తులో పొరపాట్లను సవరించుకునేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి మంగళవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుతిరిగారు. నిన్నటి వరకు తప్పిదాలను సవరించిన అధికారులు ఉన్నట్టుండి ఎన్నికల కోడ్ పేరుతో అర్జీదారులను తిప్పి పంపారు. ఎలాంటి సమాచారం లేకుండా తిప్పి పంపడంతో అధికారులపై అర్జీదారులు అసహనం వ్యక్తం చేశారు. ముందుగానే గ్రామాల్లో దండోరా వేయించి ఉంటే ఖర్చులు మిగిలేవని వాపోయారు.

ఎన్నికల తరువాతే ప్రజాపాలన దరఖాస్తులు

ఆర్మూర్‌టౌన్: లోకసభ ఎన్నికల తర్వాత ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తామని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరించడం లేదన్నారు.